క్లుప్తంగా

ప్రత్యేక పూజల్లో అంబటి మురళీ కృష్ణ



చేబ్రోలు : చేబ్రోలు మండలం వేజండ్ల రామాలయంలో వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

మల్లెల రాజు మాతృమూర్తికి నివాళి

పొన్నూరు: పట్టణంలోని 14వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పొన్నూరు మార్కెట యార్డ డైరెక్టర్ మల్లెల రాజు మాతృమూర్తి శిరోమణి (74) ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, పార్టీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ రాజు నివాసానికి వెళ్లారు. శిరోమణి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కిలారి, అంబటి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీ లోకి...



చేబ్రోలు : చేబ్రోలులోని శాలిపేట మసీదు సెంటర్‌కు చెందిన పలువురు టీడీపీకి గుడ్ బై చెప్పారు. ఆదివారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. మసీదు సెంటర్ చెందిన షేక్ శిలారు, పఠాన్ అబ్దుల్ మిత్రబృందం సహా 70 మంది సీఎం వై జగన్ మోహన్ రెడ్డికి జై కొడుతూ పార్టీ గూటికి చేరారు. వీరిని స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బండి బాబు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జూదరుల అరెస్ట్



గుంటూరురూరల్: నివాసాల మధ్యలో పేకాట ఆడుతున్న వారిని నల్లపాడు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ నరేశ్ కుమార్ వివరాల మేరకు..సుబ్బారెడ్డి నగర్ నందు ఓ ఇంట్లో జూదమాడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి నలుగుర్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.11, 500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

పట్నంబజార్: పేకాటాడుతున్న పలువురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు రోడ్డులోని లారీ స్టాండ్ వద్ద పేకాటాడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ వివరాలు అందజేయాలి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, తూర్పు నియోజకవర్గం(95) పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు (వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు మొదలుగువారు) వారి ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ, ఈ నెల 26వ తేదీలోపు నగరపాలక సంస్థ పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌లో ఫారం-12 సంబంధించిన వివరాలు అందించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులకు ఎంపికైన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వివరాలు తొలుత ఈ నెల 22వ తేదీలోపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రస్తుతం 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో విధులకు ఎంపికై న ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగేతరులు వారి ఓటు ఎక్కడ ఉన్నప్పటికీనీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుని సమర్పించవచ్చాన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 26వ తేదీలోగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్‌లో ఫారం-12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారన్నారు.

మీ ఆశీస్సులతో నామినేషన్ వేస్తున్నా..

- నియోజకవర్గానికి మరింత సేవ చేసే అవకాశమివ్వండి
- 23న నామపత్రాల్ని దాఖలు చేస్తా..
- తరలిరావాలంటూ పిలుపు
- పొన్నూరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ

పొన్నూరు : పొన్నూరు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ నెల 23న నామినేషన్ వేయనున్నట్లు అంబటి మురళీ కృష్ణ ప్రకటించారు. ఆరోజు ఉదయం 6 గంటలకు పెదకాకాని మండలం నంబూరులో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి అన్ని గ్రామాల కార్యకర్తలను కలుపుకొంటూ ర్యాలీగా వెళ్లనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12:30 గంటలకు పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ వేస్తానని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మే 13న జరిగే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించి పొన్నూరు నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని అభ్యర్థించారు. కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో నామినేషన్ వేస్తానని అంబటి మురళీకృష్ణ చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన తన కుటుంబ నేపథ్యం, రాజకీయ ప్రవేశ అనుభవాల్ని మీడియాతో పంచుకున్నారు.

వ్యాపారం నుంచి సేవారంగంలోకి..

అంబటి మురళీ కృష్ణ నిర్మాణరంగంలో వ్యాపారవేత్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆర్థికంగా నిలదొక్కుకొని సాఫీగా సాగిపోయే జీవితంలో ఏదో అసంతృప్తి ఆయన మదిని తొలిచేసింది. తన తోపాటు చుట్టూ ఉండేవారు సైతం సంతోషంగా ఉంటే చూడాలనుకున్నారు. అందుకు తనవంతుగా ఏదో సాయం చేయాలని సంకల్పించారు. పేదరికంతో సరైన వైద్య సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి సమస్యలు తీర్చాలనే ఆలోచనతో సేవారంగంలోకి అడుగుపెట్టారు.

వైద్య శిబిరాలతో అండగా..

ఐదేళ్ల క్రితం బజరంగ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసారు. పుట్టిన ప్రాంతమైన పొన్నూరు నియోజకవర్గంలోని ప్రజల కోసం నేత్ర, గుండె వైద్య శిబిరాలను నిర్వహించారు. దివ్యాంగుల కోసం ట్రై సైకిళ్లు, జైపూర్ లో తయారయ్యే కృత్రిమ కాళ్లు అందించడం చేపట్టారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొన్నూరు నియోజకవర్గంలో సుమారు 110 ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా అధునాతన పద్ధతిలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 27 వేల మందికి నాణ్యత కలిగిన కళ్లజోళ్ళు పంపిణీ చేశారు. హృద్రోగుల కోసం శిబిరాల్లో యాంజియోగ్రామ్ తో పరీక్షలు జరిపించారు. అవసమైనవారికి గుండెకు స్టంట్‌లు వేయించారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, కాళ్లు లేని వారికి జైపూర్ కృత్రిమ కాళ్లు అందించారు. ఇలా ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎనలేని సేవలనందిస్తూ ప్రజలకు మరింత దగ్గరయ్యారు.

అధినేత దృష్టిని ఆకర్షించి..

ఐదు దశాబ్దాలుగా రాజకీయ అనుభవం ఉన్న కుటుంబానికి చెందిన అంబటి మురళీకృష్ణ సేవా మార్గాన్ని ఎంచుకొని బజరంగ్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. సీఎం జగన్ నేతృత్వంలో రాజకీయాల ద్వారా మరింత సేవ చేయొచ్చని, తద్వారా పేదల కష్టాలు తీర్చవచ్చనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీలో చేరారు. ఫౌండేషన్ తరపున ప్రజలకు సేవలు అందిస్తూ, పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మన్ననలు పొందారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ తరపున పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థిగా సీఎం జగన్ ప్రకటించారు.

స్వగతం-కుటుంబ నేపథ్యం

చదువు:	బీటెక్ (మెకానికల్ ఇంజినీర్)
వృత్తి:	నిర్మాణరంగంలో వ్యాపారం
స్వస్థలం:	మామిళ్ళపల్లి, పొన్నూరు మండలం.
తండ్రి :	అంబటి వెంకటేశ్వర సుందర రామాంజనేయులు(న్యాయవాది)
అన్నయ్య :	అంబటి రాంబాబు (రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి)

సీఎం జగన్ నమ్మకాన్ని నిలబెడతా: అంబటి మురళీ కృష్ణ




పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించిన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటా. ఆయన నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. జగన్ ఆశీస్సులతో పొన్నూరు అభివృద్ధికి కృషి చేస్తా. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి నిజాయితీగా పనిచేస్తా. నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదిస్తే రాష్ట్రంలోనే పొన్నూరును అగ్రస్థానంలో నిలబెడతా. నా అభ్యర్థిత్వానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు.

నగరవాసులకు ఆరోగ్య భాగ్యం

- ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యసేవలు
- నగర పరిధిలో 16 ప్రాంతాల్లో నూతనంగా వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు
- ఒక్కో సెంటర్ రూ.కోటి వ్యయంతో నిర్మాణం
- 30వేల జనాభాకు అనుగుణంగా అన్ని వసతులతో హెల్త్ క్లినిక్‌లు

ఇది కదా.. అభివృద్ధి



అడవి తక్కెళ్లపాడులోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

నెహ్రూనగర్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విద్య, వైద్యకు పెద్ద పీట వేశారు. ముఖ్యమంగా ప్రతి పేదవాడికి మెరుగైన ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రతి జబ్బుకు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం అందిస్తూ... దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. అదేవిధంగా గుంటూరు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన వైద్యం అందించే లక్ష్యంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 16 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

ఒక్కో క్లినిక్‌కు రూ.కోటి కేటాయింపు

నగరంలో జనాభా పెరిగిపోవడంతో ప్రస్తుతం ఉన్న 13 హెల్త్ క్లినిక్‌లు ప్రజలకు సరిపడా వైద్యం అందించలేకపోతున్నాయి. దీంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేకు నగరంలో 16 ప్రాంతాల్లో వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. 30 వేల మందికి ఒక క్లినిక్ ఉండేలా హెల్త్ సెంటర్‌లను సిద్ధం చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.కోటి వ్యయంతో హెల్త్ సెంటర్‌ను అన్ని వసతులతో తయారు చేశారు. ప్రతి రోజూ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పదుల నుంచి వందల సంఖ్యలో రోగులు చికిత్స పొందుతున్నారు.

పది పడకలతో అర్బన్ క్లినిక్‌లు...

నగరంలోని ప్రజలకు అన్ని వసతులతో కూడిన క్లినిక్‌లు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఒక్కో క్లినిక్ 3600 చదరపు అడుగుల విస్తీర్ణంలో పది పడకల బెడ్లు, లేబర్ రూమ్, మిని ఆపరేషన్ థియేటర్, మందులిచ్చే గది, డ్రెస్సింగ్ రూమ్, వెయిటింగ్ హాల్, 2 ఓపీ రూమ్‌లు, మీటింగ్ హాల్/కౌన్సెలింగ్ హాల్, ల్యాబ్, వంటి ఇతర అన్ని వసతులు ఈ క్లినిక్‌లో ఉండటం ప్రత్యేకం.

అందించే వైద్య సేవలు ఇవే..

- ప్రతి రోజు ఎంబీబీఎస్ డాక్టర్‌తో కన్సల్టేషన్
- జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, పీడియాట్రీషియన్, ఆర్థోపెడిక్స్
- ప్రతి రోజు స్పెషలిస్ట్‌లతో టెలీ కన్సల్టేషన్
- నిర్దేశిత రోజుల్లో స్పెషలిస్ట్ డాక్టర్స్‌తో స్పెషాలిటీ క్లినిక్‌లు
- పల్మనాలజీ, డెర్మటాలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ
- ప్రతి రోజు ఉచిత లేబొరేటరీ సేవలు
- ప్రతి రోజు ఉచిత మందులు, ఉచిత టీకాలు
- హెమెటోలజీ ఏనలైజర్, సెమీ ఆటోమెటిక్ బయోకెమిస్ట్రీ
- ఎనలైజర్ వంటి ఆధునాతన పరికరాలతో రక్తపరీక్షలు
- ఈసీజీ, అల్ట్రాసౌండ్

ఇంటి దగ్గరే మెరుగైన వైద్యం..



గతంలో ఏదైనా అనారోగ్యం వస్తే రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న పెద్దాసుపత్రికి లేదా కొత్తపేటలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే వాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా ఇంటి దగ్గరే అన్ని వసతులతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా రూపాయి ఖర్చు లేకుండా స్థానికంగానే వైద్యసేవలు పొందగలుగుతున్నాం.

–చిలకా కృపయ్య, నాగరాజు కాలనీ

అలరించిన 'పుటుక్కు జరజర డుబుక్కమే'



నాటికలోని ఓ సన్నివేశం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అవరణలోని అన్నమయ్య కళా వేదికపై ఆదివారం రాత్రి గుంటూరు హ్యూమర్ క్లబ్ 11వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఆచార్య జంపని కిషోర్ బాబు అధ్యక్షత వహించగా, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి షేక్ లాల్‌వజీర్, వైద్యులు ఎస్.హరిప్రసాద్, మొవ్వా మాలతీదేవి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, అత్తలూరి నాగజ్యోతి హాజరయ్యారు. 113వ హాస్యవల్లరిలో భాగంగా డాక్టర్ ఎస్.హరిప్రసాద్ బృందం, గుంటూరు హ్యూమర్ క్లబ్ ప్రదర్శించిన లఘు, పుటుక్కు జరజర డుబుక్కమే హాస్య నాటికలు అలరించాయి. ఇందులో రమేష్, నాగజ్యోతి, జె.కిశోర్‌బాబు, ఎ.రాజశేఖర్, డాక్టర్ కె.కళాధర్, పి.మంగయ్య నటించి, ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక శ్రీనివాసరావుపేట అరవై అడుగుల రోడ్‌లోని గోదాదేవి, రాజ్యలక్ష్మీ సమేత శ్రీ వైకుంఠ శ్రీనివాసమూర్తి దేవాలయ ఆవరణలో ఆదివారం పునఃప్రతిష్ఠా వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం మహా గణపతి, ప్రసన్నాంజనేయ స్వామి, శ్రీగోదాదేవి, శ్రీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ వైకుంఠ శ్రీనివాసమూర్తి వారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా, పరిసర ప్రాంతాల్లోని భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు కావటి మనోహర్ నాయుడు, అధ్యక్షుడు, 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, సభ్యులు తోట సాయి, గేదెల రమేష్, రామకృష్ణ, బాబు, అంజయ్య, కోండలు పాల్గొన్నారు.

23న ఉచిత పుస్తక పంపిణీ

నగరంపాలెం: ఈనెల 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఉచిత పుస్తక పంపిణీ చేయనున్నట్లు అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం నిర్వాహకులు లంకా సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ధార్మిక విజ్ఞాన ప్రాంగణం ఆవరణలో మంగళవారం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉచిత పుస్తక పంపిణీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య, భారత ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లేపల్లి సత్యనారాయణలు హాజరై, ప్రారంభించనున్నారని చెప్పారు. పాఠకులు, పుస్తక ప్రియులు తమ వద్దనున్న పుస్తకాలు ఇతరులు చదివేందుకు ఈ పుస్తక పంపిణీలో అందించి, వారికి కావాల్సిన పుస్తకాలను ఉచితంగా స్వీకరించాలని ఆయన తెలిపారు.

ఏసు మంచి కాపరి

ఫిరంగిపురం: దయామయుడు ఏసుక్రీస్తు మంచి కాపరి అని సహాయవిచారణ గురువులు ఆర్.అనిల్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో దైవపిలుపుల ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ నా గొర్రెలు నాస్వరమును వింటాయని ఏసుక్రీస్తు పలికాడని చెప్పారు. దేవుడి స్వరమును వినాలంటే మన మనస్సును క్రీస్తు వైపునకు లగ్నం చేయాలని దానిద్వారా ఆయన ఆశీస్సులు లభిస్తాయని తెలిపారు. దేవుడు ఇచ్చిన దానిని ఆయనకే మనం తిరిగి సమర్పించాలన్నారు. గురువిద్యార్థులు ఆప్రభువు మందలోని వారుగా జీవించాలని చెప్పారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు పి.బాలస్వామి, డీకేఎస్ బాల పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మ కూడలిలోని కోదండ రామాలయంలో శ్రీ రామనవమి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో విశేష అభిషేకం, అలంకార పూజా కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్న వేళ భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కోదండరామునికి ఊంజల్ సేవ, పవళింపు సేవలు జరిగాయి. స్వరరాగ సుధ కేవీ సాయిబాబాశర్మ, ఆర్పీఎల్ నరసింహారావు భక్తి సంకీర్తనలను అలపించారు. కీబోర్డుపై రామకృష్ణ, తబలాపై షణ్ముఖ వాయిద్యా సహకారం అందించారు. ఆలయ చైర్మన్ కొమ్మినేని శివ కోటేశ్వరరావు (బాబు), ఉపాధ్యక్షుడు కిలారి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్, కిలారి రత్తయ్య, సీతారామయ్య పాల్గొన్నారు.

జన సంక్షేమమే జగన్ తారకమంత్రం

- టీడీపీ, జనసేనకు గుడ్ బై
- వైఎస్సార్‌సీపీలోకి చేరిన కార్యకర్తలు
- సాదరంగా ఆహ్వానించిన బలసాని కిరణ్ కుమార్



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరురూరల్: ప్రజాసంక్షేమమే సీఎం జగన్ మోహన్ రెడ్డి తారకమంత్రమని , అభివృద్ధి, సంక్షేమం ఆయనతోనే సాధ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ అన్నారు. మును ముందు రోజుల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ బాట పట్టనున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం వికాస్‌నగర్‌లోని ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంప్ కార్యాలయంలో గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు, బుడంపాడు, లాల్‌పురం, ప్రత్తిపాడు మండలం ఫిరంగిపురానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలతో పాటు అగ్రవర్ణాల్లోని పేద కుటుంబాలను ఆర్థిక స్వయం సాధికారత దిశగా నడిపించిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందన్నారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని బలసాని కోరారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అఖండ మేజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాక్ ఏ ప్లస్ ర్యాంక్ సాధనే లక్ష్యం కావాలి

వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

ఏఎన్‌యూ: న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) పర్యటన నేపథ్యంలో యూనివర్సిటీలోని అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బందితో ఆదివారం వీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు నాక్ సభ్యుల బృందం ఏఎన్‌యూలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని వర్గాలు సంసిద్ధంగా ఉండాలన్నారు. నాక్ పర్యటన కోసం ఇప్పటివరకు విభాగాలు సహకరించిన తీరు అభినందనీయమన్నారు. ఆయా విభాగాలు సాధించిన ప్రగతిని క్షేత్ర స్థాయిలో సమగ్రంగా వివరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి విభాగం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ విభాగం వివరాలను కమిటీ సభ్యులకు సూచించాలని తెలిపారు. అనంతరం విభాగాల్లో ఉన్న లేబొరేటరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్‌లను చూపాలన్నారు. విభాగాలు, పరిశోధన అధ్యయన కేంద్రాలు, రీసెర్చ్ సెంటర్లు, నాన్ టీచింగ్ సెక్షన్లు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. గత న్యాక్ పర్యటన నుంచి నేటి వరకు జరిగిన విభాగాల పనితీరు, సాధించిన ర్యాంకులు, పొందిన అవార్డులు, విభాగం ప్రగతి, పురోగతి వంటి అన్ని విషయాలను సిద్ధం చేయాలని సూచించారు. నాక్ ఏ ప్లస్ ర్యాంక్ సాధనే లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు. అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులందరూ అంకితభావంతో తమతమ బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఐక్యూఏసీకి పంపిన సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని, ఉన్నది ఉన్నట్టు చెప్పాలని సూచించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ వర్సిటీకి ఉన్నత ర్యాంక్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్ఠ పెంచేందుకు నాక్ గ్రేడ్ దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య సిద్దయ్య, ఆచార్య శ్రీనివాసరెడ్డిలు వారి కళాశాలల్లో అన్ని విభాగాలు నాక్ పర్యటనకు సిద్ధంగా ఉన్నాయని ఉన్నతాధికారులకు తెలిపారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఆచార్య సంధ్యకోల్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ గోపికృష్ణ, డైరెక్టర్లు, విభాగాధిపతులు, కో-ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరంలో ఐపీఎల్ ఫీవర్



గుంటూరు ఎల్ఈఎం గ్రౌండ్స్‌లో బీసీసీఐ ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పై ఐపీఎల్ కేకేఆర్, ఆర్‌సీబీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను వీక్షిస్తున్న నగరవాసులు



తమ అభిమాన జట్ల పేర్లను టాటూ వేయించుకున్న ఆనందంలో చిన్నారులు



విరాట్ కోహ్లీ చిత్రం వద్ద బాలుడు

-సాక్షి ఫొటోగ్రాఫర్,గుంటూరు

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరీ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ స్వామి కళావేదికపై గాయత్రి మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో భక్త జ్ఞానానంద తీర్థ (ఓగిరాల వీరరాఘవశర్మ) జయంతి మహోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఏపీ రాష్ట్ర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. గాన కళాప్రవీణ డాక్టర్ దుడ్డు రాధిక (హైదరాబాద్) ఓగిరాల వారి రచనలు, వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా అలరించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, మృదంగంపై ఎన్ఎస్ కళ్యాణరామన్, ఘటంపై ఎం.హరిబాబు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం ఆమెకు భక్తజ్ఞానానంద తీర్థ మెమోరియల్ అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. డాక్టర్ టి.చంద్రశేఖరరెడ్డి, ఎక్స్ చీఫ్ జియోలజిస్ట్ ఓ.ఎస్.జి.సి.ఓగిరాల రామకృష్ణ, సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆర్థికసాయం

గుంటూరు ఎడ్యుకేషన్: వాసవీమాత కృపతో వ్యాపార రంగంలో తాము ఆర్జించిన లాభాల నుంచి పేదలను, వృద్ధులను సేవ ద్వారా ఆదుకుంటున్నట్టు మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మద్దు రామకృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం చుట్టుగుంట సెంటర్‌లోని లీలా గాయత్రి కోల్డ్ స్టోరేజ్ ప్రాంగణంలో 250 మంది వృద్ధులకు ఒకొక్కరికి రూ.1200 చొప్పున మూడు నెలల పింఛను రూపంలో రూ.3లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పేద వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు, మహిళలకు వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎం.జయలక్ష్మి, భావన్నారాయణ, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.